

	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6: 30	5:16
నంద్యాల	6: 26	5:16



సైబర్ కేటుగాళ్లు

నంద్యాల క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం చాలా కష్టం. చివరకు పోలీసులు కూడా ఈ కేటుగాళ్లను పట్టుకోవాలంటే దేశ, విదేశాలకు వెళ్ల లేక వ్యయప్రయాసలకు గురవుతూ కేసుల్లో పురోగతిని సాధించలేకపోతున్నారు. బాధితులు తమ అకౌంట్ల నుంచి సొమ్ము జారిపోయాక లబోదిబోమంటూ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అవి కేవలం ఎఫ్ఐఆర్‌లకు మాత్రమే పరిమితమవుతున్నాయి. నగదు రికవరీలో ఆశించినస్థాయిలో పురోగతిలేదు. ఇదిలా ఉండగా కేటుగాళ్లు ముందుగా డబ్బున్న బడాబాబులపై కన్నేస్తారు. సెల్‌ఫోన్లతో అనుసంధానమైన బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరిస్తారు. సదరు వ్యక్తులకు ఫోన్లు చేస్తారు. లేకపోతే సంక్షిప్త సమాచారాలు పంపుతారు. లింక్‌లు పెడతారు. న్యూడ్‌కాల్స్ చేయించి వారి వీడియోలను తీసుకొని సోషల్‌మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తారు. వాట్సాప్ కాల్ ద్వారా డిజిటల్ అరెస్ట్ చేసి రూ.లక్షలు, కోట్లలో నగదును లూటీ చేస్తారు. ఇవీ సైబర్ నేరగాళ్ల చేష్టలు. నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా ఇప్పటికే ఎంతోమంది సైబర్ మోసాగాళ్ల వలలో పడి నష్టపోయారు. సైబర్ క్రైంపై పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ అవన్నీ పెడచెవినపెట్టి డబ్బుకు ఆశపడి సైబర్ గాళ్ల ఉచ్చులో ప్రజలు ఇరుక్కుంటున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.



నంద్యాల జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. 2023తో పోల్చుకుంటే 2024లో ఆ కేసుల సంఖ్య 90శాతం పెరిగింది. 2023లో 29 సైబర్ క్రైం సంఘటనలు జరగ్గా 2024లో 56 సైబర్ కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది మూడు నెలల కాలంలో కూడా సైబర్ నేరాల కేసులు జిల్లాలో నమోదవుతున్నాయి. రూ.కోట్లలో నగదు పోగొట్టుకున్నప్పటికీ వాటిలో 10శాతం కూడా రికవరీ కాలేదు. యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ వైద్యులు, ఇంటివద్ద పనిచేసే ప్రైవేట్ సంస్థల ఉద్యోగుల నుంచి సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో రూ.లక్షలు దోచేస్తున్నారు. నకిలీ వేలిముద్రలు, సెల్‌ఫోన్ నంబర్లు, ఓటీపీ, మాయమాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. సైబర్‌నేరాల కేసులు పెరిగిపోతుండటంతో వాటిపై పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వాస్తవాలను గ్రహించకుండా విద్యావంతులు, ఉద్యోగులు డబ్బు ఆశకు గురై ఉన్న డబ్బును పోగొట్టుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లా కేంద్రంలో సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాన్ని, సిబ్బందిని ఏర్పాటు చేశారు.

రూ.3 లక్షలు ఇచ్చి.. రూ.2 కోట్లు స్వాహా..!

నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుక్కుని రూ.2కోట్లు పోగొట్టుకున్నాడు. డాక్టర్ నంబర్‌కు ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ యాప్ ద్వారా ఆటలు ఆడటం ద్వారా సులువుగా తక్కువ నగదుతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని ముగ్గులోకిదించారు. లింక్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆడటం ప్రారంభించాడు. ఓ ఆటలో విజయం సాధించాడంటూ రూ.3 లక్షలు డాక్టర్ అకౌంట్‌కు జమచేశారు. దీంతో నమ్మకం పెంచుకొన్న డాక్టర్ రెట్టించిన ఉత్సాహంతో ఆటను కొనసాగించాడు. ఒక్కసారిగా సైబర్ నేరస్తులు డాక్టర్ అకౌంట్‌లోని రూ.2కోట్లు నగదును మాయం చేశారు. మోసపోయానని తెలుసుకున్న ఆ డాక్టర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా రెండు వారాల క్రితం సైబర్ క్రైంకు పాల్పడిన వారితో సత్సంబంధాలున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ముగ్గురు యువకులను నంద్యాల సైబర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



- రూ. కోట్లలో ఖాతాలకు సైబర్ నేరగాళ్ల చిల్లు
- జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఉద్యోగులు, వైద్యులు, బడా బాబులు, విద్యావంతులే బాధితులు
- పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో అవగాహన లేమి
- అప్రమత్తంగా ఉండకపోతే అంతే..



హనీ ట్రాప్‌తో రూ.6లక్షలు..

సైబర్ కేటుగాళ్లు మరో అడుగు ముందుకేసి అందమైన యువతులను అడ్డు పెట్టుకుంటున్నారు. స్వీట్ వాయిస్‌తో కాల్స్ చేసే యువతుల ద్వారా హనీట్రాప్ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఓ యువతి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించింది. రిక్వెస్ట్‌ను స్వీకరించిన రియల్ ఎస్టేట్‌వ్యాపారికి ఆ యువతితో మెసెంజర్‌లో చాటిం గ్ మొదలు పెట్టింది. ఫ్రెండ్‌షిప్ పేరుతో వ్యాపారితో చాటింగ్ చేయడం కొనసాగింది. తన వాట్సాప్ కాల్ చేసేందుకు వ్యాపారి నెంబర్‌ను సెండ్ చేయమని చెప్పింది. వ్యాపారి తన వాట్సాప్ నెంబర్‌ను సెండ్ చేయడంతో వాట్సాప్‌లో న్యూడ్ కాల్ ద్వారా మాట్లాడటం జరిగింది. న్యూడ్ కాల్‌లో మాట్లాడేటప్పుడు ఆ వ్యాపారికి సంబంధించిన వీడియోను రికార్డు చేసి తమకు డబ్బులు పంపాలని లేకపోతే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. సమాజంలో పరువు పోతుందని భావించిన ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి దాదాపు రూ.6లక్షల వరకు సమర్పించుకున్నాడు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా చోటు చేసుకున్నాయి. పరువు కోసం పాకులాడే ఆ ఘనులు విషయం బయటకు పొక్కితే పలుచనైపోతామన్న భావనతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఉన్నవారు ఎందరో.

మిగతా 6లో...

ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి : కలెక్టర్

- పీజీఆర్ఎస్‌కు 220 దరఖాస్తులు



సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు శ్రద్ధ చూపాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చారు. 220 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదులన్నింటిని డాక్యుమెంట్లతో సహా పీజీఆర్ఎస్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో ముగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 247 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 247 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 53 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 9282 మంది జనరల్ విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 9085 మంది హాజరయ్యారు. 197 మంది గైర్హాజరయ్యారు. 1038 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 988 మంది హాజరయ్యారు. 247 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ రద్దు

నంద్యాల హాస్పిటల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గతంలో మంజూరైన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య, వైద్య శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని డోన్ మండలం దొరపల్లి గ్రామానికి మంజూరైన ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను రద్దు చేసి కాకినాడ జిల్లాలోని దుమ్మలపేటకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయమై నంద్యాల జిల్లా డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ వివరణ కోరగా డోన్‌లో రెండు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయని, రూరల్ పరిధిలో మరొక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను గతంలో మంజూరు చేశారన్నారు. అందువల్ల ఈ సెంటర్ అవసరం లేదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కాగా జిల్లాలో మరో మూడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ప్రారంభమయ్యాయని, వాటిని ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరులలో ప్రారంభించామని అన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు

వివరాలు 6లో

ఉగాది ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో ఎం. శ్రీనివాసరావు, పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 27 నుంచి 31 వ తేదీ వరకు ఐదురోజులపాటు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా జరపనుంది. ఈ సందర్భంగా సోమవారం ఉగాది ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ఈవో ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యాల కల్పనలో అన్ని కోణాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాలలో తాగునీరు, వైద్యశిబిరాలు, తదితర సదుపాయాల కల్పనకు లోటులేకుండా చూడాలన్నారు. ఉత్సవాలలో స్వామి అమ్మవార్ల కైంకర్యాలన్నీ సంపూర్ణంగా జరిపించేలా చర్యలు తీసుకోవాలని వైదిక సిబ్బందికి సూచించారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుంచే క్షేత్రానికి అధిక సంఖ్యలో కన్నడ భక్తులు విచ్చేస్తారని స్వామి, అమ్మవార్ల సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దర్శనం క్యూలైన్లలో ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, క్యూలైన్లలో వేచివున్న భక్తులకు నిరంతరం మంచినీరు, మజ్జిగ, అల్పాహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రపరిధిలోని ఆరుబయలు ప్రదేశాలు, పార్కింగ్ తదితర ప్రదేశాలలో భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రపరిధిలో అన్నదాన శిబిరాలను నిర్వహించే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులకు దేవస్థానం తరపున అన్ని సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రమంతటా విద్యుత్ దీపాలంకరణ, పారిశుధ్యం, వైద్యశిబిరాల ఏర్పాటు, మంచినీటి సరఫరా, సూచిక బోర్డుల ఏర్పాటు, పుష్పాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లను సంబంధిత విభాగాధిపతుల పర్యవేక్షణలో పూర్తిచేయాలని ఈవో ఎం. శ్రీనివాసరావు ఆదేశించారు.

వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లపై ఆరోపణలు సహించం

రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఘటనలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హెచ్చరించారు. వీహెచ్‌పీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నగరంలోని హిందూ చైతన్య వేదిక, వివిధ హిందూ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రాయచోట ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ మార్చి 4న రాయచోటిలో జరిగిన వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవంలో భక్తులపై అన్యమతస్తులు దాడిచేయగా పోలీసులు వారిని అదుపు చేయ డంలో విఫలమయ్యారని విమర్శించారు. అంతేకాకుండా హిందువులపైనే లాఠీచార్జి చేసి తీవ్రంగా గాయపరిచి, భక్తులపై కేసులు నమోదు చేయడాన్ని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడారు. రాయచోటి అర్బన్ ఎస్ఐ జయనరసింహారెడ్డి ప్రవర్తన హిందువులను రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. తక్షణమే ఎస్ఐని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి రాసిన లేఖను కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, నాయకులు మహేష్, వీపూరి నాగరాజు, నీలి నరసింహ, గోరంట్ల రమణ పాల్గొన్నారు.

ఉద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకోవాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరి హాల్‌లో ఐగాట్ కర్మయోగి యాప్, పీ-4సర్వేలపై జిల్లా అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐగాట్ యాప్ ఆన్‌లైన్ కోర్సుల్లో దాదాపు 1865 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 4వ తరగతి స్థాయి అధికారి నుంచి జిల్లా ఉన్నత స్థాయి అధికారి వరకు అందరూ శిక్షణలో పాల్గొని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కోర్సు పూర్తిచేసి మంచి ఉత్తీర్ణత సాధించినవారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయన్నారు. పీ-4 సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించాలన్నారు. అధికారులందరూ ఈ సర్వేను ఈ నెల 25లోపు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉగాదినాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పీ-4సర్వేను ప్రారంభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

మోహన నారసింహుడు

- శరభ వాహనంపై విహరించిన శ్రీవారు
- 'ఎగువ'లో వేణుగోపాలస్వామిగా జ్వాలా నృసింహుడు
- వైభవంగా పొన్నుచెట్టు వాహన సేవ



మోహినీ అలంకరణలో స్వామివారి దర్శనం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీప్రాంతంలోని అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దిగువ అహోబిలంలో సోమవారం ప్రహ్లాద వరదస్వామి మో హిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ తిరువీధుల్లో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. నిత్య పూజల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు పంచామృతాభిషేకం, అర్చన, హారతి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి మండపంలో కొలువుదీర్చారు. రాత్రి ప్రహ్లాదవరస్వామిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి శరభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు.

●ఎగువలో పొన్నుచెట్టు వాహన సేవ

ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి పొన్నుచెట్టు వాహనంపై కొలువై భక్తులను అనుగ్రహించాడు. ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి వేణుగోపాలస్వామి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఆలయ మాడవీధుల్లో వేద పండితులు ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలతో అలంకరించి పొన్నుచెట్టు వాహనంపై కొలువుంచారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ మాడవీధుల్లో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.



పూజలు చేస్తున్న మఠం పీఠాధిపతి



ఎగువ అహోబిలంలో వేణుగోపాల స్వామిగా నృసింహుడి దర్శనం

నేడు కల్యాణోత్సవం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి.. వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నంద్యాలకు చేరిన 'పది' ప్రశ్న పత్రాలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్న పత్రాలు అత్యంత భద్రత మధ్య సోమవారం నంద్యాల జిల్లాకు చేరుకున్నాయి. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సెట్-1. సెట్-2 కు సంబంధించిన ప్రశ్నాపత్రాలు నంద్యాలకు చేరుకున్నాయని, వాటిని చామకాల్వ సెంటర్ సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బధ్రపరిచినట్లు తెలిపారు. మంగళవారం 12 రూట్‌లుగా విభజించి, ఆయా సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు ప్రశ్న పత్రాలను పంపించనున్నట్లు తెలిపారు. ప్రతి రూట్‌కు ఉదయం 7 గంటల నుంచే ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎంఈవోలు, ఒక గన్‌మన్ సహాయంతో అత్యంత భద్రత మధ్య పోలీస్ స్టేషన్‌కు చేరుస్తామని చెప్పారు.



నామినేషన్ దాఖలు చేసిన బీటీ నాయుడు

● సింగిల్ నామినేషన్‌తో ఏకగ్రీవం

● రేపు అధికారిక ప్రకటన

కర్నూలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానం కోసం టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ బీటీ నాయుడు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం 1:29 గంటలకు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శాసనమండలి డిప్యూటీ సెక్రెటరీ వనితారాణికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతి సచివాలయంలో కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం హెచ్ఆర్‌డీ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మంత్రి కందుల దుర్గేశ్‌తో కలసి శాసనమండలిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ముందే నిర్ణయించుకున్న శుభ ముహూర్తానికి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేశారు. అనంతరం శాసనమండలి బయట కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అమరావతికి వెళ్లిన బీటీ అభిమానులు, టీడీపీ శ్రేణులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి ఎమ్మెల్సీ బీటీ నాయుడి కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రాంతంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, సమస్యలపై మండలిలో గళమెత్తాలని యువనేత నారా లోకేశ్ బీటీ నాయుడుకు సూచించారు.

● ఆపత్కాలంలో అధినేతకు దూతగా అవకాశం ఇచ్చారు
- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ:

వైసీపీ హయాంలో రాక్షసుడైన నాటి సీఎం జగన్ అధినేత చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజులు రాజమండ్రి జైల్లో పెట్టారు. టీడీపీలో కోటి మంది క్రియాశీల సభ్యులున్నా.. ఆపత్కాలంలో దూతగా పని చేసే అదృష్టం అధినేత నాకు ఇచ్చారు. 53 రోజులు రోజు రెండుసార్లు మూలాఖత్ అయ్యే అవకాశం రావడం అదృష్టంగా స్వీకరించాను. అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ నాకు రెండో పర్యాయం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నా. మండలిలో ప్రజాగళం వినిపిస్తాను. పార్టీ బలోపేతం కోసం ఏ బాధ్యత అప్పగించినా ఓ సైనికుడిలా పని చేస్తాను.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీటీ నాయుడు, పక్కన మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు

ఇక వారం రోజులే!

● దగ్గర పడుతున్న పది పరీక్షలు

● విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

● నిపుణుల సూచనలు



పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు మిగిలింది ఇక ఆరు రోజులే. ఈనెల 17వ తేదీ నుంచి పరీక్షల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ క్రమంలో పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు రేయింబవళ్లు చదువుతున్నారు. చాలామంది ర్యాంకులు సాధించాలన్న తపనలో ఒత్తిడితో కూడా చదువును కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి పరీక్షలపై ఒత్తిడిని తగ్గించుకుని భయాన్ని దూరం చేసుకోవాలని పలువురు నిపుణులు, మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా గతేడాది డిసెంబరు 1 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విద్యా శాఖ అమలు చేస్తోంది. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు నంద్యాల జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 28,294 మంది విద్యార్థులు ఉన్నారు. బాలికలు 12,085, బాలుర 13,209 మంది విద్యార్థులు చదువుతున్నారు.

గణితంలో 6 అంశాలు చదవండి



గణితంలో కనీస స్థాయి ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందాలంటే వాస్తవ సంఖ్యలు, బహుపదులు, గ్రాస్‌లెక్క, సంచాలియత, పాఠ్యాంశాల్లో ముఖ్యమైన సమస్యలను నేర్చుకోవాలి. రెండు చరరాసులలో వేకి యా సమీకరణాల జతలోని గ్రాఫ్ 8 మార్కులకు ఖచ్చితంగా వస్తుంది. నీరూపక జామితి పాఠ్యంశం నుంచి సెక్షన్ ఫార్ములాకు చెందిన సమస్యలు 4 లేదా 8 మార్కులకు వచ్చే అవకాశం ఉంది. సంఖ్యాక శాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌పై తప్పక 8 మార్కుల ప్రశ్న ఉంటుంది. ఈ సూచనలు పాటించి ప్రాక్టిస్ చేస్తే ప్రతి విద్యార్థి గణితంలో సులభంగా ఉత్తీర్ణత పొందుతారు.

- రవీంద్రారెడ్డి, గణిత ఉపాధ్యాయుడు

ఇంగ్లీషులో పట్టు ఉండాలి



ఇంగ్లీషులో ఎడిటింగ్, ప్యాసేజ్, పోయమ్స్, డిస్కరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్, రిపోర్టేడ్ స్పీచ్ వంటి అంశాలను చదవాలి. వకాబులరి, గ్రామర్ ఎక్కువగా సాధన చేయాలి. స్కిమ్ ఫొనెటిక్స్‌ను చదివితే సులువుగా రాయవచ్చు.

- శివశంకర్, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు

అక్షర దోషాలు వద్దు



తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 25 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం ప్రశ్నావళి, చందస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలు వస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతో పాటు రామాయణం, ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

- మోహన్‌రాజు, తెలుగు ఉపాధ్యాయుడు

సైబర్ కేటుగాళ్లు

(5వ పేజీ తరువాయి)



మరికొన్ని ఘటనలు పరిశీలిస్తే...

● నంద్యాల జిల్లా కేంద్రంలో ఓ ప్రముఖ వైద్య నిపుణుడు సైబర్ క్రైం కేటుగాళ్ల వలలో చిక్కుకొని రూ.26లక్షలు సొమ్మును అప్పనంగా అప్పగించారు. ఢిల్లీ నుంచి ఉన్నత పోలీస్ అధికారుల మాదిరి నంద్యాలలో ఓ ప్రముఖ డాక్టర్‌కు కాల్ చేసి నీ నంబర్‌పై పలు కేసులు ఉన్నాయని బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ నుంచి రూ.26లక్షలు కాజేశారు. తేరుకున్న డాక్టర్ నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● అలాగే జిల్లా కేంద్రంలోని పేరుగాంచిన వైద్యుడు కూడా ఈ కేటుగాళ్ల ఉచ్చులో ఇరుక్కున్నప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకున్నాడు. వైద్యుడి వాట్సాప్ నెంబర్‌కు సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేసి ఈ నెంబర్‌పై ఆర్థిక నేరాలు తదితర కేసులు నమోదయ్యాయని బెదిరించి డిజిటల్ అరెస్ట్ ద్వారా సొమ్మును లాగేసుకొనే ప్రయత్నం చేశారు. రూ.కోటికి పైగా నగదు పంపాలని బెదింపులకు పాల్పడ్డారు. వైద్యుడు తన వాహనంలో ఫోన్ మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో సైబర్ క్రైం నేరస్తుడు పరిస్థితిని పసిగట్టి కాల్ కట్ చేయడంతో ఆ వైద్యుడు ఊపిరిపీల్చుకున్నాడు.

● ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా ఓ మహిళ తాను ఆర్డర్ చేసిన వస్తువులకు సంబంధించి పేమెంట్ చేయగా ఆ వెబ్‌సైట్ నకిలీది కావడంతో ఆమెకు మరో వ్యక్తి ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు అడిగి రూ.50వేలు కాజేశాడు. మరో ఘటనలో ఓ వ్యక్తి ఎంటర్‌ప్రైజెస్ సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. అతడి క్రెడిట్‌కార్డు వివరాలు పంచుకున్న తర్వాత అతడు భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు.

నకిలీ వేలిముద్రలంటే

ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం) విధానం ద్వారా కొన్ని బ్యాంకులు ఔట్‌లెట్ సేవలు తీసుకొచ్చాయి. వీటితో ఆధార్ నంబర్‌ను నమోదు చేసి వేలిముద్ర వేసి డబ్బులు తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ నిర్వహించే బ్యాంకులతో అనుసంధానమై కొంత కమీషన్ తీసుకొని నగదు అందిస్తుంటారు. నగదు తీసుకొనే సమయంలో వేలిముద్రలను కేటుగాళ్లు కాపీచేస్తూ వాటి ద్వారా నగదు లాగేస్తున్నారు. కేవలం ఈ ఔట్‌లెట్ల వద్దే కాకుండా ఆధార్‌ను ఉపయోగించే రవాణాశాఖ, రేషన్ డిపోలు, రిజిస్ట్రేషన్లు, మీ సేవ తదితర చోట్ల అందించే వివరాలను కాజేస్తున్నారు. దీనిని అడ్డుకోవాలంటే యాప్‌లోకి వెళ్లి థంబ్ లాక్ వేసుకుంటే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రధానంగా నమోదవుతున్న కేసులు

ఓఎల్ఎక్స్, ఫేస్‌బుక్, మార్కెట్ ప్లేస్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారములు, వస్తువులు అమ్మే పేరుతో, ఫేక్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు అధికంగా జరుగుతున్నాయి. క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డుల వివరాలు సేకరించి సైబర్ నేరస్తులు డబ్బులు కాజేస్తున్నారు. వీటితోపాటు ఫేక్‌కాల్స్, మెసేజ్‌ల ద్వారాజరుగుతున్నాయి. బ్యాంక్ అధికారులు,టెలికం కంపెనీ ప్రతినిధులుగా నమ్మించి ఓటీపీలు, పిన్ నంబర్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారు. వీటితోపాటు లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని నమ్మించి డబ్బులు డిపాజిట్ చేయించడం, కేవైసీ అప్‌డేట్ చేయాలని లేకపోతే బ్యాంక్ ఖాతా బ్లాక్ అవుతుందని నమ్మించడమో లేదా బెదిరించడమో లాంటివి జరుగుతున్నాయి. లోన్‌యాప్‌ల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నమ్మించి అధిక వడ్డీలు వసూలు చేయడం, రెండింతల అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాలంటూ బెదిరిస్తూ ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించడం తదితర వాటిద్వారా సైబర్ నేరగాళ్లు రూ.లక్షలు, కోట్లలో నగదు దోచుకుంటున్నారు.



ఫిర్యాదు ఇలా చేయాలి

బాధితులు మోసపోయామని గ్రహించిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి. సిబ్బంది అడిగే వివరాలను పూర్తిగా తెలియజేయాలి. వారిచ్చే ఐడీతో సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. సైబర్ క్రైమ్.జీవోవీ.ఇన్ యాప్ లోనూ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఈలోపు ఏటీఎం, బ్యాంక్ ఖాతాల లావాదేవీలను నిలుపుదల చేయించాలి.

Cyber Crime Helpline Number :
1930

అప్రమత్తత అవసరం

● ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇతర యాప్‌లను వినియోగిస్తే త్రీ స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. సులువుగా కాకుండా ఇతరులు గుర్తుపట్టగలిగేలా కాకుండా పాస్‌వర్డ్‌ను ఎంచుకోవాలి.

● ఎవరికీ ఓటీపీలు, ఖాతాల వివరాలు చెప్పకూడదు.

● అపరిచితవ్యక్తులు పంపే మెయిల్స్, సంక్షిప్త సమాచారాలు, లింక్‌లను ఓపెన్‌చేయకూడదు.


● ఉద్యోగులు, కొరియర్లు, ఇతర సేవల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

● అవసరం మేరకు మాత్రమే ఆధార్‌తో అనుసంధానమైన వేలి ముద్రలను ఉపయోగించాలి.

● ప్రైవేట్ ఇంటర్‌నెట్ సెంటర్లు, ఇతరుల సెల్ ఫోన్లలో ఖాతాలను సరిచూసుకోవడం మానుకోవాలి.

శంభాజీకి చిత్రనివాళి

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ధర్మవీరుడు శంభాజీ మహారాజ్ వర్థంతి(మార్చి 11) సందర్భంగా ఆయన జీవిత చరిత్రలోని కొన్ని ముఖ్యఘట్టాలను ఒకే చిత్రంలో చిత్రీకరించారు నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్. శంభాజీ బాల్యం నుంచి మరణం వరకు ఉన్న ప్రధాన ఘట్టాలు ఈ చిత్రంలో చూడవచ్చు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ కుమారుడే శంభాజీ మహారాజ్ అన్నారు. శివాజీ మరణం తర్వాత శంభాజీ మహారాజ్ 9 సంవత్సరాలు పరిపాలన చేసి 120 యుద్ధాల్లో తమ పరాక్రమం చూపించిన ధీరశాలి అన్నారు. శంభాజీ మహారాజ్ తన తండ్రి ఛత్రపతి శివాజీ మాదిరిగానే మంచి పరిపాలన చేశారన్నారు. ఆయన పాలనలో స్త్రీలకు దక్కిందన్నారు. శంభాజీ క్రమశిక్షణ, బాధ్యత కలిగిన పరిపాలకుడు అన్నారు.



ఒకే చిత్రంలో శంభాజీ చరిత్రలో ప్రధాన ఘట్టాలు

ఆలయం

రాజుల రేడు.. గోరంట్ల మాధవుడు..!

● గోరంట్లలో ప్రాచీన ఆలయం

● పూజలందుకుంటున్న లక్ష్మీమాధవస్వామి

● రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కోడుమూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భక్తుల కల్పతరువు.. కొలిచినవారి కొంగుబంగారం గోరంట్ల లక్ష్మీమాధవుడు. రాజ పోషకుడైన మాధవుడి వైభవం చూసి తరించాల్సిందే. కర్నూలు జిల్లా కేంద్రం నుంచి 35 కి.మీ, కోడుమూరు మండల కేంద్రానికి 11 కి.మీ దూరంలో గోరంట్ల గ్రామం ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో గోరువంకముని తపస్సు చేసి స్వామిని ప్రత్యక్షం చేసుకున్నాడని, ముని కోరిక మేరకు మాధవస్వామి గోరంట్లలో వెలసినట్లు ప్రచారంలో ఉంది. ఇక్కడ వెలసిన లక్ష్మీమాధవస్వామి ఆలయం జిల్లాలోనే ప్రసిద్ధి చెందింది.

● ఆలయ చరిత్ర

గోరంట్లలో లక్ష్మీమాధవ స్వామి ఆలయాన్ని క్రీ.శ 1105లో చోళరాజులు నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. ఆ తర్వాత తుళు వంశస్థుడు శ్రీకృష్ణదేవరాయలు ఆలయాన్ని సందర్శించారు. అరవీటి వంశజుడు శ్రీరంగప్పరాజయ్య లక్ష్మీమాధవ స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. వెల్దుర్తి, డోన్ మొదలగు చతుసీమలో సుమారు 500లకు పైగా ఎకరాలు పూజా కైంకర్యాలకు ఇచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఈ ఆలయంలో లక్ష్మీదేవి, మాధవ స్వామి, ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నాయి. వైష్ణవ సంప్రదాయం ఉన్న ఆలయాల్లో ఆళ్వార్లు తప్పనిసరిగా ఉంటారు. అరవీటి రాజులు ప్రతిష్ఠించిన విగ్రహం స్థానంలో 1961లో మరోసారి మాధవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాంతో గర్భగుడిలో ఈ రెండు విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. మొదటగా అరవీటి రాజుల ప్రతిష్ఠించిన మాధవ విగ్రహం పూజలందుకుంటుంది. ఇక్కడ రెండు ధ్వజస్తంభాలు ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. రాజగోపురం ముందు రాతి, గర్భగుడి ముందు చెక్కతో రూపొందించిన ధ్వజస్తంభాలు నెలకొల్పారు. ఆలయంలో చోళ, యాదవ, అరవీటి వంశస్థుల శాసనాలను చూడవచ్చు. వీటి సారాంశం మద్రాసు తాళపత్ర గ్రంథాలయంలో లభిస్తుంది. స్వామివారి రాజగోపురం ఎంతో సుందరంగా నిర్మించి ఉంది. రాజగోపుర నిర్మాణ శైలి రాజుల కళాపోషణకు నిదర్శనం. స్వామి పాదముద్రలు సమీపంలోని గట్టు మీద ఉన్న ఆనవాలు ఉన్నట్లు భక్తులు నమ్ముతున్నారు. లక్ష్మీమాధవస్వామి ఆలయానికి పూజా కైంకర్యాల నిమిత్తం వందల ఎకరాల భూములు ఉన్నాయి. ఈ ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉంది. దేవదాయ శాఖ పరిధిలో ఉత్సవాలు, భూముల వేలం నిర్వహణ జరుగుతోంది.


● 11 రోజుల పాటు ఉత్సవాలు

గోరంట్ల లక్ష్మీమాధవుడికి ధనుర్మాసంలో బ్రహ్మముహూర్తంలో పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి రోజున భక్తులకు ఉత్తరద్వారం గుండా ప్రవేశం కల్పిస్తారు. ఇదేమాసంలో గోదాదేవి, మాధవస్వామి కల్యాణం జరిపిస్తారు. శ్రావణమాసంలో ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచి సమీప గట్టు దగ్గరకు వెళతారు. పాదముద్రలకు పూజలు చేస్తారు. ఆరోజు గ్రామప్రజలంతా అక్కడికి హాజరవుతారు. అలాగే దసరా శరన్నవరాత్రుల్లో లక్ష్మీదేవి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులచే పూజలందుకుంటారు. పాల్గుణమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. సుమారు 11 రోజులపాటు వేడుకలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణం, గరుడోత్సవం, రథోత్సవం ప్రధాన ఘట్టాలు. రథోత్సవం తిలకించేందుకు నలుమూలల నుంచి వచ్చే భక్తులు హంద్రీతీరంలో టెంట్లు వేసుకుని విడిది చేస్తారు. ఈ తిరుణాలలో ఎద్దుల క్రయవిక్రయాలు, వంట, వ్యవసాయసామగ్రి అందుబాటులో ఉంటుంది. గోరంట్ల జాతరను ఈ ప్రాంత ప్రజలు రైతుల తిరుణాలగా పిలుచుకుంటారు.

● 12 నుంచి మాధవుడి బ్రహ్మోత్సవాలు



ప్రసిద్ధ గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో గుర్రెడ్డి వెల్లడించారు. 11 రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా మొదటిరోజున ఉత్సవాలకు అంకురార్పణ, రక్షాబంధనం 13న ధ్వజారోహణం, బేరి పూజ, సింహ వాహనోత్సవం, 14న శేష ఉత్సవం, 15 న హనుమంత వాహనం, 16న అర్ధరాత్రి తర్వాత స్వామి అమ్మవార్ల కల్యాణం, గరుడవాహనం, 17న గజవాహనం, 18న శిఖిోత్సవం, 19న రథారోహణం, 20న శ్రీవారి రథోత్సవం, 21న పారువేట, అశ్వవాహనసేవ, 22న హంసవాహనసేవ, చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి కంకణ విసర్జనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



పూజలందుకుంటున్న అమ్మవారు





చాంపియన్ ట్రోఫీ సంబరాల్లో అపశ్రుతి

- ఆకతాయిల వల్ల కన్ను కోల్పోయిన పండ్ల వ్యాపారి
- బాధితుడిని పరామర్శించిన ఎన్ఎండీ ఫిరోజ్



బాధితుడిని పరామర్శిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీ సంబరాల్లో దొర్లిన అపశ్రుతి వల్ల ఓ పండ్ల వ్యాపారి కంటిచూపు కోల్పోయాడు. ఈ ఘటన నంద్యాల పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచే సుకుంది. ఇండియా-న్యూజిలాండ్ మధ్య జరిగిన చాంపియన్స్ ట్రోఫీ తుదిపోరులో ఇండియా జట్టు గెలవడంతో క్రికెట్ క్రీడాభిమానులు పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు భారీఎత్తున పేల్చిన బాణాసంచా రవ్వలు అటుగా వెళ్తున్న తోపుడుబండి వ్యాపారి మహబూబ్‌బాషా కంటికి తగలడంతో తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని బాలాజీ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించాక కన్ను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యుడు ఓబుల రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌బాషా కన్ను పూర్తిగా ఛిద్రమైందని సర్జరీ ఆలస్యమైతే మరో కంటికి ప్రమాదం ఉన్నందున ఎడమ కంటిని తొలగించామన్నారు. మహబూబ్‌బాషాకు భార్య, కుమార్తె, చెవిటి, మూగ కుమారుడు ఉన్నారు.

బాధితుడి కుటుంబానికి అండగా ఉంటాం : ఫిరోజ్

క్రికెట్ సంబరాల సందర్భంగా బాణాసంచా పేలుళ్లలో కంటికి తీవ్ర గాయమై చూపు కోల్పోయిన మహబూబ్‌బాషా కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. సోమవారం ఆయన బాలాజీ హాస్పిటల్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

పోసాని కస్టడీ పిటీషన్‌ను తిరస్కరించిన ఆదోని కోర్టు

కర్నూలు లీగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని కృష్ణమురళిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆదోని మూడో పట్టణ పోలీసుల అభ్యర్థనను ఆదోని అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ అపర్ణ సోమవారం తిరస్కరించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను అసభ్యపదజాలంతో దూషించారని ఆదోని జనసేన నాయకుడు మలిశెట్టి రేణువర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదోని మూడో పట్టణ పోలీసులు పోసాని కృష్ణమురళిపై కేసు పెట్టి అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు పోసాని వాడిన బాష చాలా తీవ్రమైనవని, అతనిని మరింత లోతుగా విచారించాల్సి ఉన్నందున పోసానిని మూడు రోజుల పోలీసు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే నిందితుడి తరపున న్యాయవాదులు పోలీసుల అభ్యర్థనను వ్యతిరేకించి పోసానిని కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదించారు. గత వారంలో వీరి వాదోపవాదాలను విన్న కోర్టు తన నిర్ణయాన్ని సోమవారం వెలువరించి నిందితుడు పోసానిని పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని ఆదేశాలను జారీ చేసింది. కాగా పోసాని కృష్ణమురళికి బెయిల్ మంజూరు చేయాలని నిందితుల తరపున న్యాయవాదులు గతంలో దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌పై సోమవారం ప్రాసిక్యూషన్ తన అభ్యంతరాలను రాతపూర్వకంగా కోర్టులో దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటీషన్‌పై కోర్టు తన తీర్పును ఇంకా వెలువరించాల్సి ఉందని నిందితుల తరపు న్యాయవాది పి. సువర్ణ రెడ్డి తెలిపారు.

చోరీ చేసిన సొమ్మును ఇంటి వద్దే పడేసిన దొంగలు

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజనహల్లి గ్రామంలో మార్చి 5న జరిగిన చోరీలో అపహరణకు గురైన సొమ్ము లభ్యమైంది. చోరీకి గురైన సొమ్మును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తన ఇంటి వాకిలి వద్ద పడేసి వెళ్లారని బాధితురాలు బోయ లక్ష్మి తెలిపింది. ఈ విషయం ఆమె పోలీసు లకు తెలియజేసింది. మంత్రాలయం సీఐ రామాంజులు, క్లూజ్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో బాధితురాలికి సంబంధించిన రూ.75వేల నగదు, నగలు ప్లాస్టిక్ కవరులో ఇంటి ముందు పెట్టి వెళ్లారు. లక్ష్మి తెల్లారిన తర్వాత చూస్తే ఇంటి ముందు కవర్ కనిపించి పోలీసులకు సమ చారం ఇచ్చింది. సీఐ రామాంజులు పోలీసులతో సంఘటనా స్థలానికి వెళ్లి రికవరీ అయిన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. మాధవరం ఎస్ఐ సెలవుల్లో ఉన్నారని, ఆయన రాగానే పోలీసు ఉన్నతాధికా రులతో మాట్లాడి బాధితురాలికి సొమ్మును అప్పగించేం దుకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



సొమ్మును చూపుతున్న బాధితురాలు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

ఆస్పరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరుప్పల-కలపరి గ్రామాల మధ్య ఆటో బోల్తాపడి పందికోన గ్రామానికి చెందిన పందుల జాలరాజు (39) మృతి చెందినట్లు సీఐ మసాన్ వలి తెలిపారు. వివరాల మేరకు.. కల్లపరి గ్రామంలో ఉరుసు ముగించుకొని తిరిగి తన సొంత ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండకు తరలించారు. మృతుడికి భార్య సరోజ ఇద్దరు కూతురులు, ఒక కొడుకు ఉన్నారని సీఐ తెలిపార

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు..

పాములపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో జస్వంత్ (17) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం లింగాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ రాళ్లలోడుతో వెళ్తుండగా పాములపాడు చెలిమిళ్ల గ్రామాల మధ్యగల ఎద్దులవంక వాగు సమీపంలో బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న లింగాల గ్రామానికి చెందిన ఓబులేసు కుమారుడు జస్వంత్ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పంట దిగుబడులపై వర్క్‌షాపు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులను తట్టుకుని దిగుబడులను సాధించేందుకు ఎమ్మిగనూరులోని బనవాసిలో మంగళవారం వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో మాట్లాడుతూ కేవీకే శాస్త్రవేత్తలు ఈ వర్క్‌షాపులో రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ఎన్జీవో ప్రతినిధులు ఎస్‌పీవో సభ్యులు వాటర్‌షెడ్, టీడీఎఫ్ ప్రాజెక్టు ఏరియాలోని రైతులు పాల్గొంటారనీ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ప్రధాన సలహాదారులుగా పాల్గొని వాతావరణ మార్పులు తట్టుకునే కొత్త వంగడాల గురించి పంటల రక్షణ కోసం తగిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేస్తారని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు.



నాగార్జున వర్శిటీ బీఈడీ పేపర్ లీకేజీ ప్రకంపనలు

- జిల్లాలోని బీఈడీ కళాశాలల యాజమాన్యాల్లో అలజడి
- కళాశాలలకు ఒరిస్సా ఏజెంట్ల లింకులపై ఆరా..!
- రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అక్రమాలపై నివేదిక కోరిన మంత్రి లోకేష్
- నివేదిక కోరిన మాట వాస్తవమే: ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్సిటీలో బీఈడీ సెమిస్టర్ లీకేజీ వ్యవహారంపై జిల్లాలోని బీఈడీ కళాశాల యాజమా న్యాల్లో గుబులు రేపుతోంది. బీఈడీ మొదటి సెమిస్టర్ పేపర్‌ను బీఈడీ కళాశాలల యాజమాన్యాలు, ఒరిస్సా ఏజెంట్లు కలిపి లీకేజీ చేశారనే వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీసులు సైతం ఒరిస్సా ఏజెంట్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. విద్యాశాఖ మంత్రి ఈ విష యాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న పనితీరు, అవినీతి, అక్రమాలపై నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు మంత్రి లోకేష్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఆదేశాల మేరకు రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలల్లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. అరెస్టు అయిన ముగ్గురు ఒరిస్సా ఏజెంట్ల విద్యార్థులు జిల్లాలోని కొన్ని కళాశాల్లో ఉండడటం యాజమాన్యాల్లో గుబులు రేపుతోంది. సదరు బీఈడీ కళాశాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుపుతుండగా, ఉర్దూ అడ్మిషన్లకు అనుమతులు కూడా లేకపో వడంతో సమస్య తమ మెడకు ఏమైనా చుట్టుకుంటుందా? అని ఓ మాజీ ఉపకులపతి ద్వారా సోమవారం ఉన్నత విద్యామండలిలో సమస్యను చక్కది ద్దుకునేందుకు యాజమాన్యాలు అపసోపాలుపడు తున్నట్లు కొందరు ప్రొఫెసర్లు చర్చించుకుంటున్నారు. సొంత భవనాలు లేకపోగా విద్యార్థులు కళాశాలలకు రాకపోయినా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చూసిచూడనట్లు పూర్తిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

2024-25 బీఈడీ అఫ్లియేషన్ వరకు సీడీసీలోని ఒక కింది స్థాయి ఉద్యోగి పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చారని విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. జిల్లాలలోని ఏ ఒక్క కళాశాలకు ఉర్దూ అడ్మిషన్స్‌కు అనుమతి లేకున్నా వర్శిటీ అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చారనే ఫిర్యాదులు ఇటీవల ఉన్నత విద్యామండలి ఛైర్మన్, రాష్ట్ర గవర్నర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు.

నంద్యాల జిల్లాలో ఉన్న కొన్ని బీఈడీ కళాశాలల పరీక్షా సెంటర్‌లను వర్శిటీలో ఒక అధికారి ముడుపులు తీసుకుని కర్నూలులో వేయించారని ఇటీవల ఉపకులపతికి ఓ విద్యార్థి సంఘం ఫిర్యాదు చేసింది. ఇలా విద్యాశాఖ మంత్రి కోరిన నివేదికలో ఈ అక్రమాలు బయటకు వస్తాయని బీఈడీ కళాశాలల యాజమాన్యాలలో అలజడి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న క్రమంలో రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహణ ప్రక్రియతో పాటు పరీక్షలు, తరగతుల జరుగుతున్న విధానంపై నివేదిక కోరారు. అందుకు తగ్గట్టుగా నివేదికలు పంపుతామని ఉపకులపతి డాక్టర్ వెంకట బసవరావు తెలిపారు.

ఆస్తి కోసం తల్లిని కడతేర్చిన కొడుకు

- రోకలి బండతో చంపిన వైనం





వృద్ధురాలు పుల్లమ్మ మృత దేహం, విచారణ చేస్తున్న సీఐ మురళీధర్‌రెడ్డి

ఉయ్యాలవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కంటి పాపలా చూసుకోవాల్సిన కొడుకు ఆస్తి కోసం మద్యం మత్తులో కడతేర్చాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడలో జరిగింది. సోమవారం తెల్లవారు జామున వృద్ధురాలు అంబటి చిన్న పుల్లమ్మ(75)ను ఆమె కొడుకు బాలగుర్రప్ప రోకలి బండతో కొట్టి హత్య చేయడం స్థానికంగా కలకలం రేపింది. పుల్లమ్మకు కుమారుడు, కుమార్తె మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆమె చుట్టు పక్కల గ్రామాల్లో సున్నం అమ్ముకుంటూ జీవిస్తోంది. కుమారుడు బాల గుర్రప్ప మద్యానికి బానిసై డబ్బు కోసం తల్లిని, భార్యను వేధించేవాడు. దీంతో అతని భార్య 10 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయింది. అప్పటి నుంచి బాలగుర్రప్ప మద్యం తాగుతూ బయట తిరిగేవాడు. అప్పుడ ప్పుడూ తల్లి దగ్గరకు వచ్చి డబ్బు కోసం వేధిస్తూ ఉండేవాడు. ఇటీవల వృద్ధురాలు తన ఇంటిని మనవడు శివశంకర్ పేరు మీద రాయించింది. దాన్ని జీర్ణించుకోలేక ఆస్తిని తన పేరుమీద రాయించాలని గొడవపడేవాడు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వృద్ధురాలు వంట చేస్తుండగా డబ్బులు ఇవ్వాలని అడిగితే తల్లి ఇవ్వలేదు. దాంతో గుర్రప్ప పక్కనే ఉన్న రోకలిబండ తీసుకొని తలపై బలంగా కొట్టటంతో వృద్ధురాలు అక్కడికక్కడే నేల వాలింది.

ఇంటి చుట్టు పక్కలవారు, బంధువులు గమనించి ఆమెను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. వృద్ధురాలి అల్లుడు షేగు రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి విచారణ చేపట్టారు. నంద్యాల నుంచి క్లూజ్‌టీమ్స్‌ను రప్పించి రక్తపు మరకలు, వేలిముద్రలను సేకరించారు. స్థానికులు నిందితుడ్ని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలి రావాలి

- కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు



మాట్లాడుతున్న చింతా సురేష్‌బాబు

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పన్నెండో ఆవిర్భావ సభను ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించబోతున్న సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి భారీ ఎత్తున జన సైనికులు తరలి రావాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని జనసేన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ సభ పిఠాపురంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు దూసుకుపోతోందని, ప్రజలు గమనిస్తు న్నారని అన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుపై, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగతగా దూషిస్తూ మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పవన్ కల్యాణ్ స్థాయి గురించి మాట్లాడటం సరికాదన్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై మాట్లాడాలని, లేదంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ల మంజునాథ్, జనసేన పార్టీ నాయకులు పీబీవీ సుబ్బయ్య, వై. బజారి, షబ్బీర్, సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ నాయకుడిపై దాడి..

- అనుమతి లేకుండా పొలంలో ఎలా పనిచేస్తారని ప్రశ్నించినందుకే..!



బాధితులను పరామర్శిస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఐ టీడీపీ మండల అధ్యక్షుడు గణేకల్లు విరుపాక్షిపై అదే గ్రామానికి చెందిన ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన మేరకు.. తన అన్న చిన్న బంగారయ్య పొలంలో అనుమతి లేకుండానే సోమవారం ఉదయం ఉపాధి పనులు చేస్తున్నారు. దీంతో తాను తన అనుమతి లేకుండా ఎలా పనిచేస్తారని సవారి, మల్లేష్, మల్లయ్యతో పాటు మరికొందరిని ప్రశ్నించారు. తాను ఇలా ప్రశ్నించడాన్ని మనసులో పెట్టుకుని రాత్రి తనపై, తన అన్నపై కారం చల్లి కట్టెలతో దాడి చేశారు. చుట్టు ప్రక్కల వారు గమనించి విడిపించారు. దాడి చేసిన వారంతా మహిళా నాయకురాలి అనే ఆరోపించారు. గ్రామస్థులు తమను ఆదోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, తిమ్మప్ప, లక్ష్మీ నారాయణ, తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. భయపడొద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయి సాగు చేస్తూ, ప్రయాణికుల ద్వారా ఏళ్ల తరబడి కర్ణాటకకు తరలిస్తున్న వైసీపీకి చెందిన ఇద్దరి వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కర్ణాటకలో ఒక వ్యక్తి గంజాయిని విక్రయిస్తుండగా, అక్కడ పోలీసులు అదుపులో తీసుకోవడంతో ఆదోని మండలం పెద్దహరివాణం కేంద్రంగా గంజాయి దందా బట్టబయలైంది. దీంతో ఆదోని రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి గంజాయి సాగు చేస్తున్న పెద్దహరివాణం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కోటేకల్లు అయ్యన్న, మల్లికార్జునను అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కోటేకల్లు అయ్యన్నకు గజ్జెహళ్ళి రహదారిలో మూడెకరాల పొలం ఉంది. ఆ పొలంలో అయ్యన్నతోపాటు మల్లికార్జున ఏళ్ల తరబడి గంజాయిని సాగు చేసి, గిఫ్ట్ బాక్సుల్లో పెట్టి పెద్దహరివాణం నుంచి కర్ణాటకకు రాకపోకలు చేసే ప్రయాణికులు, విద్యార్థుల ద్వారా కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు తరలిస్తున్నారు.

వెలుగులోకి ఇలా..

20 రోజుల క్రితం మల్లికార్జున సమీప బంధువు శిరుగుప్పలో గంజాయిని విక్రయిస్తుండగా, అక్కడ పోలీసులు అదుపులో తీసుకున్నారు. కర్ణాటక పోలీసుల విచారణలో గంజాయి సాగుతో పాటు విక్రయమంతా ఆంధ్రలోని ఆదోని మండలం పెద్దహరి వాణం నుంచే జరుగుతోందని తేల్చి, ఆంధ్ర పోలీసులకు సమాచారం అందజేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్చీ ఎస్.ఐ నాగేంద్ర, అగ్రికల్చర్ అధికారి అశోక్ కుమార్‌రెడ్డి, సిఎస్‌డిటి వలిబాషా సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. అయ్యన్న, మల్లికార్జున సాగు చేస్తున్న మిరప పొలంలోని గంజాయి మొక్కలను, వారి ఇళ్లలో ఉన్న కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి కర్నూలు కోర్టుకు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- పోస్టర్లను ఆవిష్కరించిన కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా పైనున్న కుటుంబాల సామాజిక బాధ్యతగా అట్టడ గునున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ-4 విధానమన్నారు. దీనిపై ప్రజల సూచనలను కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. మార్చి 9 నుంచి 25 వరకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి Https://swarnandhra.ap.gov.in/p4 లింక్ ద్వారా అభిప్రాయాలు తెలియజేస్తే వారి సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసాపత్రాన్ని కూడా అందజేస్తామన్నారు. పీ-4 విధానం కాన్సెప్ట్‌ను తెలియజేస్తూ మారథాన్ కార్యక్రమాలను నిర్వహించడం విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అవగాహన పీ4 కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'నిబంధనలు ఉల్లంఘిస్తే మద్యం దుకాణాలు సీజ్'



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ

జూపాడుబంగ్లా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల వద్దే కూర్చుని మద్యం ప్రియులు తాగినట్లు ఫిర్యాదులొచ్చినా, నిబంధనలు ఉల్లంఘించినా మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ మద్యం దుకాణాల యజమానులను హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బార్లు తెరిచారు' శీర్షికతో మద్యం దుకాణాల ఇష్టారాజ్యంపై కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి జూపాడుబంగ్లాలోని రెండు మద్యం దుకాణాలను పరిశీలించారు. అక్కడ కూర్చుని తాగుతున్న మద్యం ప్రియులను బయటికి పంపించారు. మద్యం దుకాణ ఆవరణలో మద్యం ప్రియులకోసం ఉన్న మాంసం దుకాణం, శీతల పానీయాలను తీసేయాలని ఆదేశించారు. మద్యం దుకాణానికి సంబంధించిన లైసెన్సు కనబడకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు, మద్యం బాటిళ్ల ధరల పట్టిక అందరికీ కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో అప్పటికే ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూసిన బెల్ట్ నిర్వాహకులు పరారయ్యారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో దాడులు నిర్వహించారు. పోతులపాడు గ్రామంలో ఒక బెల్ట్ నిర్వాహకుడడి వద్ద 12 మద్యం సీసాలు, పారుమంచాల గ్రామంలో ఓవ్యక్తి వద్ద 20 లీటర్ల నాటుసారా పట్టుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. మిగతా గ్రామాల్లో కూడా దాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు పాల్గొన్నారు.

పనిచేయని మానిటర్లు

- ప్రతి సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి నందికొట్కూరుకు వెళ్తున్న అధికారులు



ఎంపీడీవో కార్యాలయంలో పని చేయని మానిటర్

జూపాడుబంగ్లా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన మానిటర్ పనిచేయడం లేదు. ఎంపీడీవో కార్యాలయంలో గత రెండు వారాల నుంచి పనిచేయడం లేదు. దీంతో వివిధ శాఖల మండల అధికారులంతా ప్రతి సోమవారం నందికొట్కూరుకు వెళుతున్నారు. దీంతో ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ప్రజలు ఏఅధికారికి ఫిర్యాదు ఇవ్వాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను వివరణ కోరగా మానిటర్ మరమ్మతులకు గురైందని, ఈ విషయాన్ని విజయవాడ సచివాలయానికి సమాచారం అందించామని చెప్పారు.

'సమస్యలు పరిష్కరించాలి'



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సున్నిపెంట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్మికులు సున్నిపెంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు అయినా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు కాశమ్మ, రమణమ్మ, జయమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ జట్టుకు శిక్షణ ప్రారంభం

పాణ్యం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు శిక్షణ సోమవారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఈనెల 14 వతేదీ నుంచి 17 వతేదీ వరకు బెంగళూరు నార్త్ యూనివర్సిటీ లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కళాశాల సిబ్బంది అభినందించారు.

ఆలయంలో చోరీ

పాణ్యం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు మజరా గ్రామం వడ్డుగండ్ల లో ఆదివారం ఆంజనేయస్వామి ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్థులు దేవాలయంలోకి వెళ్లి చూడగా హుండీ తాళం పగులగొట్టినట్లు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు సమాచారం అందించామన్నారు. సోమవారం రాతపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు కుసుమన్న, మోహన్, ఎల్లాక్రిష్ణ తెలిపారు. హుండీని నాలుగేళ్లుగా తీయలేదని దాదాపు రూ. 40 వేలు ఉంటుందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్ట్ శ్రీనివాసులుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసులు

నందికొట్కూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ అండ్ సోషల్ సర్వీస్ విభాగంలో ఉత్తమ సేవలు చేస్తున్న ఆర్ట్ శ్రీనివాసులకు యూఎస్‌ఏకు చెందిన టెక్లా అఫ్లియేటెడ్ విత్ డైస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. సోమవారం హైదరాబాదులో వర్సిటీ డైరెక్టర్ వరప్రసాదరావు ఆర్టు శ్రీనివాసులుకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఆర్ట్స్ అండ్ సోషల్ సర్వీస్ విభాగంలో మరింత సేవలు చేయాలని ఆయన సూచించినట్లు శ్రీనివాసులు తెలిపారు.

సరిహద్దు సమస్య

- ఈ నెల 9న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై దాడి చేసి బంగారు ఎత్తుకెళ్లిన దుండగులు
- కేసు నమోదు విషయంలో పాణ్యం, బేతంచెర్ల పోలీసుల మధ్య గందరగోళం
- పాణ్యం పరిధిలోకి వస్తుందని నిర్ధారించిన రెవెన్యూ అధికారులు

పాణ్యం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పాణ్యం, బేతంచెర్ల మండలాల మధ్య గల సిమెంటునగర్ సమీపంలోని హద్దులపై పోలీసుల మధ్య గందరగోళం నెలకొంది. దీంతో హద్దుల సమస్య ఏర్పడి ప్రమాద సమయంలో ఏ మండల పోలీసులు కేసు నమోదు చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈనెల 9వ తేదీన ఇదే స్థలంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుపై జరిగిన దారి దోపిడీ ఘటనతో హద్దుల సమస్య మరోమారు వెలుగులోకి వచ్చింది. బేతంచెర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు జస్వంత్ మోటారు సైకిల్‌పై బేతంచర్లకు వెళ్తుండగా ఎదురుగా ట్రాలీ వాహనంతో ఢీకొట్టి ఇంజనీరు వద్ద ఉన్న బంగారు నగలు దోచుకొని తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన ఇంజనీరు బస్సు ఎక్కి బేతంచెర్లకు వెళ్లి ప్రాథమిక వైద్య చేయిచుకొని అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లినట్లు సమాచారం. కాగా సమాచారం తెలిసిన బేతంచెర్ల, పాణ్యం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి తమది కాదంటూ ఎవరిదారిన వారు వెళ్లినట్లు తెలిసింది. అయితే బేతంచెర్ల పోలీసులు ఈ ఘటనపై చొరవ చూపి కేసును దర్యాప్తు చేసి నిందితుల్లో ఒకరిని గుర్తించినట్లు తెలిసింది. కాగా పాణ్యం పోలీసులు మాత్రం ఘటనా స్థలం తమ పరిధిలోకి వస్తుందని సోమవారం తెల్లవారుజామున కేసు నమోదు చేసినట్లు తెలిసింది. సోమవారం పాణ్యం, బేతంచర్ల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, అటవీ శాఖ అధికారులు నరేంద్రనాథ్‌రెడ్డి, ప్రకాష్‌బాబు, కిరణ్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరావు, నరేంద్రకుమార్‌రెడ్డి, రమేష్‌కుమార్‌లతో పాటు ఎఫ్‌బీవో మహేశ్వరి, రెండు మండలాల సర్వేయర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హద్దులు గుర్తించి ఘటన జరిగిన ప్రాంతం పాణ్యం మండలానిదేనని నిర్ధారించారు.

పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ పాణ్యం, బేతంచర్ల మండలాల మధ్య సిమెంటునగర్ సమీపంలో హద్దులు గుర్తించడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. గతంలో ఫ్యాక్టరీ ఏర్పడని సమయంలో తయారు చేసిన సర్వే మ్యాపుతో గ్రామం ఏర్పడడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కాగా ఈనెల 9న దారి దోపిడీ ఘటనతో హద్దుల సమస్య జఠిలంగా మారిందని, ఇరు మండలాల రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. నేరప్రాంతం పాణ్యం మండలంగా గురించామని, పాణ్యం పరిధి దాదాపు ఫ్యాక్టరీ సమీపంలోని కందికాయపల్లి రోడ్డు వరకు వస్తుందని చెప్పారు.



ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

'సావిత్రి బాయి పూలే మహిళలకు ఆదర్శం'



పాములపాడులో నివాళి అర్పిస్తున్న నాయకులు, అధికారులు

నందికొట్కూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి పూలే మహిళలకు ఆదర్శమని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు అన్నారు. సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు బీబీ, లక్ష్మీదేవి, రామకృష్ణ, సుధాకర్, వెంకటలక్ష్మమ్మ, రమణమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని అంబేడ్కర్ పూలే గ్రంథాలయంలో ఇన్‌చార్జి నల్లమల అబ్రహం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయుర్వేద వైద్యాధికారి సావిత్రి పాల్గొని సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి, మాల మహానాడు నాయకులు అంకన్న, జిల్లా నాయకులు నాగరాజు, రజక సంఘం నాయకులు రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ జాబితాలో చేర్చాలి'

నందికొట్కూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా యూత్ అధ్యక్షుడు పరిగెల సుంకన్న కోరారు. నందికొట్కూరు పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు. సుంకన్న మాట్లాడుతూ బేడ బుడగ జంగం కులానికి కుల ధృవీకరణ పత్రం లేక గత 17 ఏళ్లుగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి తాలుగా అధ్యక్షుడు సరిగిరి రామలింగం, అప్పస్వామి శ్రీనివాసులు, బాలస్వామి, అంజనేయులు, పెద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నందికొట్కూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బేబి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పరిమళాదేవి, తలాత్ పర్వీన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోరాట స్ఫూర్తికి నిదర్శనమని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, శ్రామిక మహిళా నాయకురాలు భారతి అన్నారు. సోమవారం ఆత్మకూరు ధనుంజయ మీటింగ్ హాల్‌లో అంతర్జాతీయ దినోత్సవ వారోత్సవాల వేడుకలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం ఉత్సవం కాదని, మహోజ్వల పోరాటమని అన్నారు. అయితే పలు రాజకీయ పార్టీలు మహిళా దినోత్సవాన్ని మహిళలకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉత్సవంలా జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఆయా సంఘాల నాయకులు రామ్‌నాయక్, రణధీర్, మాబాషా, ఇందిరమ్మ, జ్యోతి, శాంతి, సామక్క, లక్ష్మీబాయి, సుజాత, వరలక్ష్మి, లింగమ్మ తదితరులు ఉన్నారు.

'సమస్యలు తెలుసుకోడానికే చైతన్య యాత్రలు'

బండిఆత్మకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యల సేకరణకే ప్రజా చైతన్య యాత్రలు చేపట్టినట్లు సీపీఎం నాయకులు రత్నమయ్య, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, నాగరత్నం అన్నారు. సోమవారం మండలంలోని పార్నపల్లె గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ నేటి నుంచి 18వ తేదీ వరకు యాత్రలు చేపడతామని, ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులు తదనంతరం 22వ తేది వరకు శాఖల వారిగా అందజేస్తామని చెప్పారు. శీను, వసంత, నాగలక్ష్మి, రమ్య పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'



మహిళకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు

మహానంది, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుక్కాపురం గ్రామంలోని మండల ఐక్య సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద శిక్షణ పొందిన 40 మంది మహిళలకు సోమవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ ప్రతాపరెడ్డి, నంద్యాల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ నాగేంద్ర ప్రసాద్, డీపీఎం బాబురావు, మండల ఏపీఎం తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పాములపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ కర్నూలు వారి ఆధ్వర్యంలో ఉచిత టైలరింగు శిక్షణ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, బలిజ కులాల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మహిళలకు బేసిక్ టైలరింగు శిక్షణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. 45, 60, 90 రోజుల శిక్షణ ఉంటుందని, అనంతరం అర్హులైన వారికి కుట్టు మిషన్ అందిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నెంబర్ జతచేసి సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాలను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్రంలో సారా నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0కార్యక్రమ పోస్టర్లను కలెక్టర్ రాజకుమారితోపాటు ఎక్సైజ్ జిల్లా అధికారి రవికుమార్ తదితరులు విడుదల చేశారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలి

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. దూరదృష్టితో ప్రభుత్వం స్వచ్ఛంద కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తూ ప్రతి శాఖకు లాగిన్ ఇచ్చి సదరు కార్యక్రమాలను నిర్వహించి అప్‌లోడ్ చేయడంలో ఎందుకు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. శని, ఆదివారాల్లో ప్రజాప్రతినిధులు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారని, సదరు అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన కుట్టు మిషన్ల శిక్షణలో మహిళలు పాల్గొనాలన్నారు. ప్రతినియోజకవర్గంలో 500 మందికి శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించామని, 18 నుంచి 50ఏళ్ల వయస్సువారు అర్హులని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3440మందికి శిక్షణ ఇచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

గడివేముల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి సోమవారం వేలం పాటలు నిర్వహించగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది రూ.1,67,500 పోగా ఈ ఏడాది రూ.1.70 లక్షలు వేలం పాట పలికిందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యావేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం'

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోము వీర్రాజును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. బిజేపీ పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసిన నాయకులకు అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నంద్యాలలో పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకున్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఫిరోజ్

నంద్యాల రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాల పట్టణ సమీపంలోని నందమూరినగర్, వైఎస్సార్ నగర్‌లో రోడ్ల పనులను సోమవారం ఆయన పరిశీలించారు.

- నందమూరినగర్ మసీద్-ఏ-హప్స మసీదులో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఫిరోజ్ పాల్గొన్నారు. సోమవారం రాత్రి ఉపవాస దీక్షల విరమణ కంటే ముందు మసీదులోని సహచర ముస్లీంలతో కలిసి నవాజ్ చేశారు. తాటికొండ బుగ్గరాముడు, దేరెడ్డి శివనాగిరెడ్డి , ఉప్పరిసురేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పించారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు ఎంతో దార్శనికంగా పనిచేస్తున్నాయన్నారు.
- నంద్యాల మండలంలోని పాండురంగాపురంలో రెండు రోజుల పాటు రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయ 32వ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఫిరోజ్ దర్శించుకున్నారు. ఆదిరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, మారుతిప్రసాద్ తదితరులు ఉన్నారు.

'అందుబాటులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు'

వెలుగోడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఏవో మాట్లాడుతూ మండలంలో భూములు కల్గిన ప్రతిరైతుకు విశిష్ట సంఖ్య గుర్తింపు కార్డులను అందిస్తున్నామన్నారు. రైతులు తమ సమీప రైతుభరోసా కేంద్రాలలో తమ వివరాలు అందచేసి ఈ గుర్తింపుకార్డు పొందాలని తెలిపారు. కార్యక్రమమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోఆర్డీ మురారి, హౌసింగు ఎఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'రైతులను కాపాడాలి'

నంద్యాల నూనెపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి రైతులను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు రంగనాయుడు, సోమన్న, శ్రీనివాసులు మాట్లాడుతూ ఫ్యాక్టరీవల్ల వచ్చే కాలుష్యంతో రైతుల పంటలు నాశనమవుతున్నాయన్నారు. కాలుష్యం నుంచి పంటలను కాపాడి నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న దేవాలయ మాన్యం భూములను బహిరంగ వేలం ద్వారా రైతులకే కేటాయించాలన్నారు. అనంతరం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

శ్రీశైలంలో వెండి రథోత్సవం



వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని లోక కల్యాణార్థం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం వెండి రథోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్చరణలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షిక వేడుకలు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి ప్రతిష్ఠా షోడశ వార్షిక వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం ప్రభాతపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలయందు చండీహోమాలు నిర్వహించారు. అనంతరం బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషపూజా, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా రుద్ర హోమం

ఆత్మకూరురూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవీ ఆలయంలో కురుకులాంబదేవి జయంతి ఉత్సవాల్లో భాగంగా దంపతుల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. లోకకల్యాణార్థం మార్చి 8 నుంచి 12వ తేది వరకు నిర్వహించే ఈ ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు గూడా వెంకటాచలపతి శర్మ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో కురుకులాంబ అమ్మవారికి శ్రీసూక్తఅభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించి, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చలు, సహస్రనామ స్తోత్ర పారాయణాలు చేపట్టారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా రుద్రహోమం నిర్వహించారు.

కమనీయం.. నరసింహ స్వామి కల్యాణం

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లో నరసింహ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నరసింహస్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'హిందువులపై దాడులు సరికాదు'



ర్యాలీ చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హిందువులపై దాడులు సరికాదని హిందూ సంఘాల నాయకులు అన్నారు. రాయచోటిలో హిందువులపై జరిగిన దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా సోమవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నంద్యాలలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ, బీజేపీ, ధార్మిక సంఘాలు, దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ టెక్కె వీహెచ్‌పీ కార్యాలయం నుంచి శ్రీనివాససెంటర్, వివేకానంద సెంటర్, గాంధీ చౌక్ మీదుగా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బసవన్నగుడి నుంచి శ్రీనివాససెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులు పెట్టిన హిందూ భక్తులను వెంటనే విడుదల చేయాలి. వీరభద్రస్వామి పార్వేట ఉత్సవాల్లో హిందూ భక్తులపై దాడి చేసి మహిళలు, పిల్లలు అని చూడకుండా విచక్షణా రహితంగా కొట్టిన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ హిందువులు అందరూ అందరిని సమానంగా చూడటం వల్ల చేతకానితనంగా భావించడం అవివేకమని అన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బజరంగ్‌దళ్ సంయోజక్ పోలేపల్లి సందీప్, జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, కమ్మయ్య, నాగరాజు, విశ్వనాథ్‌రెడ్డి, రామాంజనేయులు, బీజేపీ నాయకులు మేడా మురళీధర్, నిమ్మకాయల సుధాకర్, బసవరాజు, హిందువులు పాల్గొన్నారు.

'రోడ్డు పనులను అడ్డుకోవడం దారుణం'



అటవీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

మహానంది, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అనుమతుల పేరుతో రోడ్డు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం దారుణమని కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. సోమవారం మహానంది నుంచి గాజులపల్లి మార్గంలో అధ్వాన్నంగా ఉన్న రహదారిని ఆధునీకరిస్తుండగా అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. దీంతో కేసీ కెనాల్ అధ్యక్షుడితో పాటు ఎంపీపీ యశస్వీని, తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్‌తో పాటు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి అక్కడికి చేరుకున్నారు. అటవీశాఖ డీఆర్వో హైమావతితో పాటు సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని రహదారి ఆధునికీకరణ పనులను చేస్తుండగా అడ్డుకోవడం సబబు కాదని అన్నారు. అడ్డుకోవడానికి గల ఆధారాలను చూపాలన్నారు. అటవీ సిబ్బంది సమాధానం తెలపకపోవడంతో తిరిగి రహదారి పనులను ప్రారంభించారు.

'పది' విద్యార్థులకు నజరానా

● ప్రోత్సాహకాలు ప్రకటించిన బీసీ రాజారెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

కొలిమిగుండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఈనెల 17వ తేదీ నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు భారీ నజరానా ప్రకటించారు. ఈ మేరకు ఆయన ప్రోత్సాహకాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన పదో తరగతి విద్యార్థులు నంద్యాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అం దజేస్తామని ప్రకటించారు. ఎంతమంది టాప్ మార్కులు వస్తే వారందరికీ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేయనున్నారు. ఇక బనగాపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె మండలాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులందరికీ రూ.50వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారు. వాస్తవానికి బీసీ రాజారెడ్డి 2021నుంచి పది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తున్నప్పటికీ ఈ ఏడాది నుంచి భారీ మొత్తంలో అందజేయనున్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు : బీసీ రాజారెడ్డి

ఉన్నతమైన విద్యతోనే సమాజం మార్పు చెందుతుంది. విద్యాభివృద్ధిలో నా వంతు పాత్ర పోషించడానికి నెనెప్పుడూ ఆసక్తిగానే ఉంటాను. విద్యార్థుల్లో పోటీ తత్వం పెంచాలన్నదే నా ఆకాంక్ష. విద్యార్థుల్లో ఈ పథకంపై చర్చ జరిగి, బాగా చదివితే నాకెంతో సంతోషం. అందుకోసమే ఇంత పెద్ద ఎత్తున పురస్కారాలు ప్రకటించాం.

నాటుసారాతో అనర్థాలు

● ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి

డోన్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తాగడం వల్ల అన్ని అనర్థాలేనని డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సీఐ వరలక్ష్మి అన్నారు. సోమవారం డోన్ ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం పోస్టర్లను సీఐ వరలక్ష్మి సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీదారులు తమ పద్ధతులు మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'రెగ్యులర్ లైసెన్స్‌ను పునరుద్ధరించాలి'

డోన్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటిస్తూ వైన్‌షాపును నడుపుతున్నట్లు రెగ్యులర్ లైసెన్సును పునరుద్ధరించాలని ఆర్‌ఈ రాఘవేంద్రగౌడు కోరారు. ఇటీవల గీత కార్మికులకు డోన్‌కు రెండు వైన్ షాపులను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఒక వైన్‌షాపు ఆర్‌ఈ రాఘవేంద్ర గౌడుకు రాగా, తాత్కాలిక లైసెన్సు మీద డోన్ పట్టణంలోని తారకరామనగర్ ప్రధాన రోడ్డులో నూతన వైన్‌షాపును ప్రారంభించారు. అయితే నిబంధనల పేరుతో ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి పెంచడంతో సోమవారం వైన్‌షాపు లైసెన్సుదారుడు ఆర్‌ఈ రాఘవేంద్ర డోన్ ఎక్సైజ్ స్టేషన్ వద్దకు వెళ్లి ఎక్సైజ్ సీఐ వరలక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా రెగ్యులర్ లైసెన్సును పునరుద్ధరించాలని కోరారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

కొలిమిగుండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు మందా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు పరీక్ష అట్టలు(ప్యాడ్), పెన్నులు పంపిణీ చేశారు. సోమవారం కొలిమిగుండ్ల కస్తూర్బా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి మండల అధ్యక్షుడు గోపాల్‌గారి దస్తగిరి, బాషా, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, దస్తగిరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై తప్పుడు ఆరోపణలు సరికాదు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని, వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. సోమవారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ సీనియర్ నాయకుడు అంబటి జయలక్ష్మిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, అన్నెం జయరామిరెడ్డి, నంద్యాల ప్రసాద్ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. చింతలాయపల్లెలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న భూవివాదాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై రుద్దడం దుర్మార్గమన్నారు. మరోసారి మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో కోటపాడు శివరామిరెడ్డి, వెంకటకొండారెడ్డి, సీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వర స్వామి పల్లకి సేవ



బనగానపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో సోమవారం ఉమామహేశ్వరస్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. పల్లకీ సేవ ఉత్సవం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మాళేశ్వరరెడ్డి, భక్తులు పల్లకిసేవలో పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎస్ఐ లేక ఇక్కట్లు



చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రమణయ్య సంజామల పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త ఎస్ఐ రమేష్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలల విధుల అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు రెండు నెలల క్రితం చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు స్టేషన్ల పనిభారంతో ఇన్‌చార్జి ఎస్ఐ సతమతమవుతున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కరించే నాథుడే లేరని ప్రజలు వాపోతున్నారు. ఎస్ఐ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చాగలమర్రి పీఎస్‌కు రెగ్యులర్ ఎస్ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

మైదానంలోకి మురుగు

● ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలసిన బంకులు

● ఇబ్బంది పడుతున్న వాకర్స్, క్రీడాకారులు

బనగానపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాకర్స్, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు మూసుకొని వాకింగ్ చేసే దుస్థితి నెలకొంది. ప్రభుత్వ బాలికల ఎస్సీ హాస్టల్‌కు సంబంధించిన మురుగునీరు ఉన్నతపాఠశాల మైదానంలో పారుతోంది. మురుగునీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో హాస్టల్‌పక్కనే ఓ పెద్దగుంత తవ్వారు. గుంత నిండిపోవడంతో మురుగునీరు పాఠశాల మైదానంలో పారుతోంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తోంది. పాఠశాల మైదానం ఆనుకొని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని బంకులు ఏర్పాటు చేసుకున్న వారు చెత్తాచెదారాన్ని అక్కడే వేస్తున్నారు. దీనికి తోడు ప్రైవేట్ లారీ యజమానులు సైతం మైదానాన్ని పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నా ఇటు పాఠశాల హెచ్‌ఎం గానీ, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. దీంతో పాఠశాల మైదానం అధ్వానంగా మారింది. నిత్యం పట్టణవాసులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. మురుగునీరు మైదానంలో పారడం, చెత్తాచెదారం వేయడంతో పాటు లారీలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మురుగునీరు పాఠశాల మైదానంలోకి కాకుండా చర్యలు తీసుకొని చెత్తాచెదారం వేసే వారిపై, లారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే పాఠశాల మైదానాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకొని బంకులు ఏర్పాటు చేసి అద్దెలు వసూలు చేసుకుంటూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బనగానపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో పారుతున్న మురుగునీరు



పాఠశాల ఆవరణలో వేసిన చెత్తాచెదారం

'ఆడుదాం ఆంధ్రా' పేరుతో భారీ అవినీతి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్రా పేరుతో గత వైసీపీ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గళమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో రూ.120 కోట్లతో క్రీడలు నిర్వహించామని గొప్పలు చెప్పుకున్నారే తప్ప రాష్ట్రంలో క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించలేదన్నారు. అలాగే నాణ్యతలేని క్రీడా కిట్లను పంపిణీ చేశారన్నారు. పబ్లిసిటీ కోసం తాపత్రయపడ్డారే గానీ క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదన్నారు. వివిధ రకాల క్రీడలు నిర్వహించేందుకు రూ.120 కోట్లు ఖర్చు చేశామని చెబుతాన్నారే గానీ వాటికి సంబంధించిన వివరాలు తెలియడం లేదన్నారు. కేవలం పబ్లిసిటీ కోసం రూ.35 కోట్లు ఖర్చు చేశారన్నారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఇవ్వాల్సిన నగదు ప్రోత్సాహకాలు ఇంకా క్రీడాకారులకు జమ కాలేదన్నారు. విశాఖ పట్టణంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో సైతం భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. విశాఖ పట్టణంలో నిర్వహించిన క్రీడలు, విజేతల వివరాలను ప్రస్తుత శాప్ చైర్మన్ రవి నాయుడును అడగగా గత ప్రభుత్వంలోనే ఆ వివరాలన్నింటిని తొలగించినట్లు తెలిసింద న్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై సంబంధిత మంత్రి సమగ్రంగా విచారించి నిధుల దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకునేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.



చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం

దొర్నిపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని కేసీ కెనాల్ కింద సాగు చేసిన రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందజేస్తామని డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షుడు బబ్బూరి వెంకటస్వామి అన్నారు. సోమవారం దొర్నిపాడు కేసీ కెనాల్‌కు నీరు రావడంతో ఏరువ ప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ నాయకుడు సిద్ధి సత్యం, తెలుగు యువత అధ్యక్షుడు తాళ్లూరి రమేష్ నాయుడు, రైతులతో కలిసి కేసీకెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సాగు నీరు లేక వేసిన పైర్లు ఎండుదశకు చేరడంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి కేసీకెనాల్ అధికారులతో మాట్లాడి సుంకేసుల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించారన్నారు. కేసీకెనాల్ డీఈ రవీంద్ర మాట్లాడుతూ రైతులు సాగునీరు వృథా చేయకుండా వంతుల వారిగా పైర్లకు నీరు కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేసీకెనాల్ ఏఈ రంగారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు నాయుడు, శివారెడ్డి, ఉయ్యాలవాడ నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాయనగారి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, తోట సంజీవకుమార్, గంగవరం కృష్ణారెడ్డి తదితరులున్నారు.



కేసీకెనాల్‌ను పరిశీలిస్తున్న డీఈ, కమిటీ అధ్యక్షుడు

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



ఆర్డీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

డోన్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 4న వీరభద్రస్వామి ఆలయ స్వామివారి పార్వేట ఉత్సవంలో హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డోన్ విశ్వహిందూ పరిషత్ నాయకులు చలపతిరావు, శివయ్య, ఆర్మీ రామయ్య, వడ్డె మహారాజ్ డిమాండ్ చేశారు. సోమవారం డోన్ ఆర్డీవో నరసింహులుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందువులపై దాడులు చేయడం చాలా సిగ్గు చేటన్నారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అవుకు వెంకటేశ్వర్లు, టైలర్ నాగార్జున, శివయ్య, వీరేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ జడ్పీటీసీ మృతి



జడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్యాపిలి జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి(78) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పదిరోజుల క్రితం పట్టణంలో శ్రీరామిరెడ్డి వాకింగ్ వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ శ్రీరామిరెడ్డి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీరామిరెడ్డి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాజీ ఆర్థిక మంత్రి పరామర్శ

హైదరాబాద్‌లో బోరెడ్డి శ్రీరామిరెడ్డి మృతదేహాన్ని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సందర్శించారు. కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీరామిరెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

బీటీ నాయుడుకు మంత్రి బీసీ అభినందన

బనగానపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రెండోసారి టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన కర్నూలు జిల్లాకు చెందిన బీటీ నాయుడును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విజయవాడ సచివాలయంలో సోమవారం అభినందించారు. సచివాలయంలో మంత్రి బీసీని బీటీ నాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.



బీటీ నాయుడును అభినందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పీ-4 సర్వేను వేగవంతం చేయాలని సచివాలయ ఉద్యోగులను ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో కుటుంబాల పూర్తి వివరాలు ఉంటాయన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలన్నారు. కుటుంబ వివరాలను సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుల్లేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు.

ఎల్‌సీడీ, సీడీ సర్వే వేగవంతం

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఎల్‌సీడీ, సీడీ సర్వేను వేగవంతం చేయాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, పుట్టకతో వచ్చే వ్యాధులపై సర్వే జరిపి యాప్‌లో నమోదు చేయాల న్నారు. క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన పరీక్షలను కూడా చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందికి సహకరించాలని అన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

ప్యాపిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగనవాడీ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బేబిరాణి, సుబ్బరావమ్మ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు భారతికి అంగన్‌వాడీ వర్కర్లు వినతి పత్రం అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

డోన్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వైసీపీ కార్యాలయంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కురుకుంద హరి, జిల్లా వలంటరీ విభాగం ఉపాధ్యక్షులు పోస్టు ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే జరిమానా

బేతంచెర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ దుకాణాలు, యజమానులు, చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకున్న, వారితో పని చేయించుకున్నా రూ.50వేలతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారని డోన్ అసిస్టెంట్ లేబర్ అధికారి నీలిమ సంధ్య సూచించారు. సోమవారం పట్టణంలోని వస్త్ర దుకాణాలను, వందే మార్ట్ గార్మెంట్ షాపులను పలు వ్యాపార దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట కానిస్టేబుల్ తిరుమలేష్, సీఆర్‌పీలు శేషు, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిన ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్‌కు ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉదయ్ కుమార్, భాస్కర్, శేఖర్, నారాయణరెడ్డి, చందు, సాగర్, మహేష్ సాయి, హేమంత్, వసంత్ కుమార్, సుభాష్, సూర్య రాజు వెంకి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన నందిపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ బాబాఫక్రుద్దీన్ తెలిపిన వివరాలమేరకు నందిపాడు గ్రామానికి చెందిన గుండ్రం గురప్ప(40) ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- సునీత, కస్తూర్బా ప్రిన్సిపాల్, చాగలమర్రి



చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రిన్సిపాల్ సునీత అన్నారు. ఇప్పటికే యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని ముందుకుపోతున్నట్లు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు.

ప్రశ్న: కస్తూర్బాలో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: కస్తూర్బాలో శుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. పిల్లలకు అందించే భోజనం నాణ్యతగా ఇస్తున్నాం.

ప్రశ్న: కస్తూర్బాలో ఎంతమంది చదువుతున్నారు?

జవాబు: కస్తూర్బాలో 6నుంచి 10 వరకు 200మంది బాలికలు, ఇంటర్ కళాశాలలో 53 మంది బాలికలు చదువుతున్నారు. వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

ప్రశ్న: కస్తూర్బాలో సిబ్బంది కొరత ఉందా?

జవాబు: పాఠశాల, కళాశాలలో సిబ్బంది కొరత ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సిబ్బందిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. పాఠశాలలో ప్రహరీ సమస్య కూడా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రశ్న: బాలికలకు కాస్మోటిక్ చార్జీలు పంపిణీ చేస్తున్నారా?

జవాబు: మూడేళ్ల నుంచి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. బాలికలకు పెట్టేలు, దుప్పట్లు కూడా ఇవ్వడం లేదు. పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: ఇంటర్ కళాశాల బాలికలకు గదుల కొరత ఉందా?

జవాబు: నాలుగు భవనాల పనులు పూర్తి చేశారు. మరో నాలుగు భవనాల పనులు జరుగుతున్నాయి. టింకర్ ల్యాబ్ కోసం ప్రత్యేక గది పనులు చేపట్టాం.

ప్రశ్న: బాలికలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?

జవాబు: కస్తూర్బాలో చదివే బాలికలకు మెనూ ప్రకారం భోజనం అమలు చేస్తున్నాం. మెనూలో సిబ్బంది అలసత్వం లేకుండా చూస్తున్నాం. బాలికలకు నాణ్యతగల భోజనం ఇస్తున్నాం.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

- వ్యవసాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ జాన్సన్

బనగానపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నంద్యాల వ్యవసాయపరిశోధన సంచాలకులు డాక్టర్ జాన్సన్ అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక తలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆచార్యఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ ఉప సంచాలకులు ముకుందరావు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు దత్తత గ్రామాల సంఖ్యను పెంచుకుంటూ జిల్లాల్లో ఎక్కువ గ్రామాల రైతులకు సేవలందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తడు శ్రీనివాసులు, కేవీకే బనవాసి సమన్వయకర్త రాఘవేంద్ర, కర్నూలు జిల్లా డాట్ సెంటర్ సమన్వయకర్త సుజాతమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చాగలమర్రి, శిరివెళ్ల, రుద్రవరం రూట్ అధికారి న్యామతుల్లా తెలిపారు. సోమవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. ఆయన వెంట రూట్ ఆఫీసర్ బాల నాగిరెడ్డి, కస్టోడియన్ వెంకటేశ్వర్లు, జాయింట్ కస్టోడియన్ నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బనగానపల్లె : పదోతరగతి పబ్లిక్ ప్రశ్నాపత్రాలు సోమవారం బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. కస్టోడియన్ మాధవస్వామి, ఆయా పాఠశాలల చీఫ్‌లు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రశ్నాపత్రాలు సబ్జెక్టుల వారిగా బాక్సుల్లో భద్రపరచి వాటిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి సీజ్ చేశారు.

ఉయ్యాలవాడ: పదో తరగతి పరీక్షల ప్రశ్నా పత్రాలు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరాయి. పరీక్షల చీఫ్ అధికారి నరసింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సుధాకర్‌రావు ప్రశ్నాపత్రాలను స్టేషన్‌లో భద్రపరిచారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు ఉన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో పశువైద్య సిబ్బంది వేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను ఏడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దూడలకు బ్రూసెల్లేస్ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయిబాబా, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

14నుంచి జమాల్‌వలి ఉరుసు

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలి గ్రామ సమీపంలో వెలసిన కృష్ణంపల్లె జమాల్‌వలి ఉరుసు ఈనెల 14నుంచి నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ వెన్నపూస పెద్దపుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి సోమవారం తెలిపారు. 14న గంధం, 15న ఉరుసు ఉంటుందన్నారు. కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచే కాక పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జమాల్‌వలిస్వామికి ప్రత్యేక ఫాతెహాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ సందర్భంగా 15న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు గ్రామ పంచాయతీలో వేలం

కోవెలకుంట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంత మార్కెట్, దిన మార్కెట్, కబేళాకు వేలం నిర్వహించనున్నట్లు కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి , ఈవోపీఆర్‌డి ప్రకాశ్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేజరు గ్రామ పంచాయతీల్లో నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా సమస్యలపై మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోవెల కుంట్ల డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే సెల్ నెం.9959225798కు ఫోను చేసి తెలపాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిద్ధరామేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

కొలిమిగుండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన పురాతన సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారు పంచముఖ శివయ్య అలంకరణలో దర్శనమిచ్చారు. సోమవారం ఫాల్గుణ మాసం ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్వర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.